## క్లుప్తంగా

### నేడు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

**హుజూర్‌నగర్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతి చట్టంపై సోమవారం పట్టణంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగార్జునరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సదస్సులో కలెక్టర్ పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, రైతులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**చిలుకూరు :** మండల కేంద్రంలో సోమవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ధృవకుమార్ ఆదివారం తెలిపారు. ఈ సదస్సుకు కలెక్టర్ హాజరవుతున్నట్లు, రైతులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

**రేపు భూ భారతిపై అవగాహన సదస్సు**

**మోతె :** మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 11గంటలకు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్ శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. ఈ సదస్సులో మండల ప్రజలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా దొడ్డా వెంకటయ్య



**చిలుకూరు :** మండల కేంద్రానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా వెంకటయ్య అఖిల భారత రైతు సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 15,16,17తేదీల్లో తమిళనాడు రాష్ట్రం నాగపట్టణంలో జరిగిన అఖిల భారత రైతు సంఘం 30వ జాతీయ మహాసభలో తనను నియమించారని అన్నారు. రైతాంగ సమస్యలపై ఉద్యమాలు చేయనున్నట్లు తెలిపారు.

### ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఎంఈఓ సలీంషరీఫ్, ఉపాధ్యాయులు

**కోదాడరూరల్ :** పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 8వతరగతి చదుతున్న విద్యార్థి ఇషాద్ తండ్రి యాకబ్ రిక్షా తొక్కుకుంటూ కటుంబాన్ని పోషిస్తున్నాడు. యాకబ్‌కు ఇటీవల క్యాన్సర్ సోకడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ విషయాన్ని తెలుసుకున్న కొంత మంది పాఠశాల ఉపాధ్యాయులు ముందుకు వచ్చి రూ.15వేల ఆర్థికసాయాన్ని ఆదివారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మార్కేండేయులు, ఉపాధ్యాయులు ఖాజామియా, బడుగుల సైదులు, వినకొల్లు శ్రీనివాసరావు, ఎండీ.ముక్తార్, వాచ్‌మెన్ సైదులు ఉన్నారు.

### డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



ప్రచారం నిర్వహిస్తున్న సామాజిక కార్యకర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రభాకర్

**మఠంపల్లి :** యువత, విద్యార్థులు డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సామాజిక కార్యకర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శుభవార్త చర్చి తిరునాళ్ల సందర్భంగా భారీగా జనసంచారం ఉండడంతో మత్తు పదార్థాల నిర్మూలనపై ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు.

### వాసవీ, వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



హుజూర్‌నగర్ : అన్నదానం చేస్తున్న సభ్యులు

**హుజూర్‌నగర్ :** పట్టణంలోని వాసవీ క్లబ్, వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆదివారం పట్టణంలో అమావాస్య అన్నప్రసాద వితరణ గావించారు. ఈ సందర్భంగా దాదాపు 250మందికి పైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆయా క్లబ్‌ల నాయకులు కె.పాపారావు, వి.వెంకటేశ్వర్లు, యు.వెంకటేశ్వర్లు, పి.ఝాన్సీరాణి, టి.ప్రవళిక, హరీష్, పి.వెంకటేశ్వర్లు, డి.నాగేశ్వరావు, మురళి, కొండలరావు, మాధవ్, సతీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**నేరేడుచర్లలో అమావాస్య అన్నదానం**

**నేరేడుచర్ల :** మండల కేంద్రంలోని శ్రీశ్రీకన్యకాపరమేశ్వరీ సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం దాతల సహకారంతో 500మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాచకొండ శ్రీనివాసరావు, నటరాజ్, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, అశోక్, సత్యనారాయణ, అంజయ్య, సురేష్, లచ్చయ్య, వెంకటేశ్వర్లు, హరిప్రసాద్, గోపాలకృష్ణ, రాము, వాసు, అనిల్, బ్రహ్మం, భాగ్యలక్ష్మి, వాసంతి, సరస్వతి, జ్యోతి, రాధిక, సంధ్య పాల్గొన్నారు.

## జోరుగా మట్టి దందా

- ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు
- ఇటుక బట్టీలకు తరలిస్తున్న వ్యాపారులు
- చోద్యం చూస్తున్న అధికారులు



చెరువుతండా వద్ద ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరుపుతున్న అక్రమార్కులు



డంప్ చేసిన చెరువు మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు

**పాలకవీడు :** మండలంలో మట్టి దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ భూములు ఖాళీగా కనబడితే చాలు అక్రమార్కులు డేగకన్నుతో అక్కడ వాలిపోతున్నారు. రాత్రికిరాత్రే గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు జరిపేస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో భారీ యంత్రాల సాయంలో వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీనికి తోడు డంప్ చేసిన చెరువు మట్టిని టిప్పర్ల సాయంతో ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయాలకు గండి కొడుతూ అక్రమార్కులు అందినకాడికి దోచుకుని సొమ్ము చేసుకుంటున్నారు. సామాన్యులు ఇసుక, మట్టి కావాలంటే అనుమతుల పేరిట కాలయాపన చేస్తున్న అధికారులకు అక్రమ తవ్వకాలు కనిపించడంలేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సి యంత్రాంగం చోద్యం చూస్తోందంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. వారి కనుసన్నల్లోనే ఈ మట్టిదందా సాగుతుందని ఆరోపిస్తున్నారు.

**టన్నుల కొద్దీ టిప్పర్లలో తరలింపు..**

మండలంలోని జాన్‌పహాడ్ పరిధిలోని చెరువుతండా సమీపంలోని ప్రభుత్వ భూమిలో టన్నుల కొద్ది మట్టిని టిప్పర్లతో తరలిస్తున్నారు. భారీ యంత్రాల సాయంతో చెరువుతండా సమీపంలోని పల్లెప్రకృతి వనాన్ని అనుకుని ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 319లో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇక్కడి నుంచి టిప్పర్ల సాయంలో శూన్యపహాడ్, గణేష్‌పహాడ్, హనుమయ్యగూడెం, కోమటికుంట సమీపంలో బండల రాళ్లపై పోసి చదును చేస్తున్నట్లు సమాచారం. అవి ప్రభుత్వ, అటవీ భూముల్లో తోలకాలు జరుపుతున్నట్లు సమాచారం . అధికారులకు ఈ విషయం తెలిసినా నామమాత్రంగా తనిఖీలు జరిపి వెళ్తున్నారే తప్ప అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడడంలేదు. గత వేసవిలో జాన్‌పహాడ్ చెరువు మట్టిని భారీగా అక్కడ ప్రభుత్వ భూముల్లో డంప్ చేయడం, ఇటుక బట్టీలకు తరలిస్తుండడంతో అధికారులు అడ్డుకుని నిలిపివేశారు. ప్రస్తుతం డంపు చేసిన చెరువు మట్టిని టిప్పర్లతో ఇటుక బట్టీలకు తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి దందా సంబంధిత శాఖల అధికారులు దృష్టిసారించి కట్టడి చేయాలని, లేకపోతే చెరువు, ప్రభుత్వ భూములు గుట్టలు గుల్లవుతాయని పలువురు వాపోతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందిందని, ఎవరూ మట్టి తరలింపుకు అనుమతులు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## దేశ సంరక్షణకు కంకణబద్ధులు కావాలి



నేరేడుచర్ల : మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, నాయకులు

**నేరేడుచర్ల :** దేశ సమగ్రత సంరక్షణకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉగ్రవాదుల దుర్మార్గపు చర్య బాధాకరంగా ఉందన్నారు. ఇప్పుడిప్పుడే కశ్మీర్‌లో కుంకుమ పువ్వు ఉత్పత్తి పెరిగి ఆర్థిక పరిస్థితి మెరుగుగా ఉన్న ఈ సమయంలో ఈ ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో మన్‌కి బాత్ జిల్లా కో ఆర్డినేటర్ వంగవీటి శ్రీనివాస్‌రావు, పట్టణ మన్‌కి బాత్ ఇన్‌చార్జ్ నాగయ్య, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొనతం నాగిరెడ్డి, సంరచనా ప్రభారీ శోభారెడ్డి, సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, ఏమిరెడ్డి శంకర్‌రెడ్డి, సైదులు, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

**వృద్ధాశ్రమంలో అన్నదానం అభినందనీయం**

**మునగాల :** అనాథ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో కోదాడ పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు జిల్లా జనార్దన్‌రావు పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనాథలకు సహాయ, సహకారాలు అందించి వారికి అండగా నిలవాలని సూచించారు. అదేవిధంగా ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మను అభినందించారు. ఆశ్రమానికి పార్టీ పరంగా తమ వంతు సహాయ, సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ కోదాడ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ, నాయకులు వంగవేటి శ్రీనివాసరావు, ఎలమంచలి శ్రీనివాసరావు, దళిత మోర్చా ఉపాధ్యక్షుడు వంగాల పిచ్చయ్య, నాయకులు ఓరుగంటి పురుషోత్తం, మల్లెబోయిన వెంకటేష్‌బాబు, నాగేంద్రచారి, డి.లక్ష్మి, శోభ, ఉడత విశ్వనాథం, ఎల్లేశ్వరరావు, భాగ్యరాజు, యాదా కిరణ్, నల్ల నాగేశ్వరరావు, గజ్జి రామూర్తి, మండలానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ వేమూరి సత్యనారాయణ, ఆశ్రమ కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాంలో ఉగ్రదాడి మృతులకు ఘన నివాళి



హుజూర్‌నగర్ : కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



చిలుకూరు : కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న పాస్టర్ అబ్రహం, క్రైస్తవులు

**కోదాడ :** కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడారు. కులమతాలకతీతంగా 140కోట్ల మంది భారతీయులు ఏకత్రాటిపై నిలబడి పాకిస్తాన్ ఉగ్రవాద కిరాతక చర్యలను ఖండించాలని పిలుపునిచ్చారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పైడిమర్రి నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు, పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి పందిరి సత్యనారాయణ, సంఘం నాయకులు పైడిమర్రి సత్యబాబు, ఓరగంటి ప్రభాకర్, గరిణె శ్రీధర్, పైడిమర్రి వెంకటనారాయణ, చల్లా ప్రకాష్‌రావు, ఇడుకుళ్ల చెన్నకేశవరావు, ఇమ్మడి రమేష్, యాదా సుధాకర్, రాయిపూడి వెంకటనారాయణ, ఓరుగంటి కిట్టు, యాదా రమేష్, వంగవేటి శ్రీనివాసరావు, జనార్దన్, బెలిదె భరత్, ఇమ్మడి అనంతచక్రవర్తి, వంగవీటి భరత్‌చంద్ర, వాసవీక్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

**దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం**

**హుజూర్‌నగర్ :** దేశ ప్రయోజనాలకు ఎవరైనా విఘాతం కల్గిస్తే చూస్తూ ఊరుకోమని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉగ్రవాదులు చేసిన దాడి యావత్ దేశంపై చేసిన దాడిగా భావిస్తున్నామన్నారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిని కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు. ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల రమేష్, మామిడి వెంకయ్య, యల్లావుల రమేష్, జడ వెంకన్న, మీసాల గాంధీ, జక్కుల రమణ, బండారు మహేష్, జక్కుల అఖిల్ పాల్గొన్నారు.

**ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి**

**చిలుకూరు :** కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడులను నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని కవనెంట్ చర్చిలో పాస్టర్ అబ్రహం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని అన్నారు. కార్యక్రమంలో క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మునగాల : సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

**మునగాల :** మండలంలోని కలకోవ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1996–2005లో పదోతరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం స్థానికంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆనాడు విద్యాబోధన చేసిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు బొగ్గారపు రామమూర్తి, కొలుకులపల్లి సంజీవరావు, సూర్యనాయిక్, వస్తంనాయక్, శ్రీనివాసరావు, సూర్యనాయిక్, ఆనాటి విద్యా వలంటీర్లు సిర్రా వెంకన్న, ఉపేంద్రచారి, బుర్రి ప్రవీణ్, విద్యార్థులు పడిసిరి నరసింహారావు, పనస కోటయ్య, మండవ లక్ష్మీనారాయణ, కుంభజడ మురళి, సురభి సందీప్, కాసాని శ్రీను, సోమగాని కరుణాకర్, కళ్యాణి, మమత, రజిత తదితరులు పాల్గొన్నారు.

**గరిడేపల్లి :** మండల పరిధిలోని కీతవారిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, సువర్ణ, సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు, జగదీష్, శేఖర్, కీత శ్రీనివాస్, అంజయ్య, ఆజాన్‌బాబా, విద్యార్థులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

## వరంగల్ సభకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు

**మునగాల :** బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తొలుత ఆయా గ్రామాలలో పార్టీ జెండాలను ఎగురవేశారు.

**చిలుకూరు:** వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ 25వ ఆవిర్భావ బహిరంగ సభకు మండలం నుంచి పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు.

**నడిగూడెం :** వరంగల్‌లో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు మండల వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో బీఆర్‌ఎస్ జెండాలను ఎగురవేశారు.

**హుజూర్‌నగర్ :** బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పట్టణంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో పార్టీ దిమ్మెలపై బీఆర్‌ఎస్ జెండాలను ఆవిష్కరించారు.

**గరిడేపల్లి :** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయా గ్రామాల్లో జెండాలు ఎగురవేశారు.

**నేరేడుచర్ల :** మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వరంగల్ సభకు తరలివెళ్లారు.

**మఠంపల్లి :** మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ జెండాలను ఎగురవేశారు.

**హుజూర్‌నగర్ :** మండలంలో బీఆర్‌ఎస్ ఆవిర్భావం సందర్భంగా పార్టీ జెండాలను ఆవిష్కరించారు.

**కోదాడరూరల్ :** బీఆర్‌ఎస్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని మాజీ ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గుడిబండలో పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎగరవేసి మాట్లాడారు. అనంతరం పట్టణంలో కేక్ కట్ చేసి పార్టీ రజతోత్సవ వేడుకలకు వెళ్తున్న వాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు.

## మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలి



కోదాడరూరల్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు



హుజూర్‌నగర్ రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

**మునగాల :** మండలంలో మే డే వేడుకలను విజయవంతం చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం మండలంలోని కొక్కిరేణిలో నిర్వహించిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా నిర్వహించే మే డే కార్యక్రమాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో పార్టీ గ్రామశాఖ కార్యదర్శి నందిగామ సైదులు, మండల కమిటీ సభ్యులు రేఖ లింగయ్య, నాయకులు, రావులపెంట బ్రహ్మం, రావులపెంట వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ములకపల్లి సైదులు, డీవైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి మామిడి గురుమూర్తి, పార్టీ సభ్యులు రావులపెంట శేషగిరి, ఇంటూరి హుస్సేన్, పాలపాటి జయరాజు, ములకపల్లి నాగరాజు, మంద శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

**కోదాడరూరల్ :** మే డే ఉత్సవాలను వాడవాడలా ఘనంగా జరుపుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వి.నరసింహారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని లాల్‌బంగ్లా వద్ద సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన మే డే పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు మే డే వేడుకల్లో పాల్గొని ఐక్యతను చాటాలన్నారు. భారతదేశంలో పాలకులు అవలంబిస్తున్న తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కుల రక్షణ కోసం మే డే అమరుల స్ఫూర్తితో ఉద్యమిద్దామన్నారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, అలుగుబెల్లి సత్యనారాయణరెడ్డి, మైసయ్య, వీరబాబు, రవితేజ, సలీం, కొండలు, ఖాసీం, సురేష్ తదితరులు ఉన్నారు.

**హుజూర్‌నగర్ రూరల్ :** ప్రపంచ కార్మిక దినోత్సవమైన మే డేను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్ అన్నారు. ఆదివారం మండలంలోని గోపాలపురంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే డేను మండలంలోని అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు సిద్దిల వెంకటయ్య, నెట్టే వెంకటేశ్వర్లు, చందాల భిక్షం, బండి గోపి, మీగడ రాములు, మాధవరావు, కాలవ వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, కోటేశ్వరరావు వెంకన్న పాల్గొన్నారు.

**గరిడేపల్లి :** మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గుంజ నరసింహారావు కోరారు. ఆదివారం మండల పరిధిలోని గడ్డిపల్లిలో మే డే వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తుక అంజయ్య, శ్రీను, లింగయ్య, నాగేశ్వరరావు, సైదులు, హుస్సేన్, ఎల్లయ్య, నరేష్, అంజయ్య, నాగయ్య, రవి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'రెయిన్' పరిశ్రమలో జాతీయ భద్రతా ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి

**మేళ్లచెరువు :** మండలంలోని రామాపురం పరిధిలో గల రెయిన్ సిమెంట్ పరిశ్రమలో జాతీయ భద్రతా ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. పరిశ్రమలోని అన్ని విభాగాలలో భద్రతకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ జీఎం సీతారామిరెడ్డి, హెచ్‌ఆర్ హెడ్ వెంకటేష్, భద్రతా అధికారి శ్రీనివాసరావు, ఏజీఎం వెంకటేశ్వరరావు, కార్మికులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన సాంబయ్యకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న బుచ్చిపాపయ్య

**మునగాల :** మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొండమీది సాంబయ్య, బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు తంగెళ్ల నరేష్ ఆదివారం ఆ పార్టీకి రాజీనామా చేసిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన స్థానికంగా కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుచ్చిపాపయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు గట్టు ఉపేందర్‌రావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొక్కెళ్లపాటి సాయి, కారింగుల వెంకన్న, కోల వెంకన్న, మచ్చ శంకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు సందీప్, మురళి పాల్గొన్నారు.

## మహిళలు సామాజికంగా అభివృద్ధి చెందాలి



ఏఎంసీ చైర్‌పర్సన్, ఏజీపీ దంపతులను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

**హుజూర్‌నగర్ :** మహిళలు రాజకీయ, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందాలని బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని కనకదుర్గ దేవాలయంలో బ్రాహ్మణ సంఘం తరఫున హుజూర్‌నగర్ ఏఎంసీ చైర్‌పర్సన్ దేశ్‌ముఖ్ రాధిక, జిల్లా ఏజీపీ శ్రీనివాసుల రేణుక దంపతులను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దామోదరాచార్యులు, డి.రామకృష్ణ ప్రసాద్, రమణారావు, శేషగిరిరావు, శ్యాంసుందర్, ఉమా, దీప, అంజని, గిరిజ, కె.ప్రసాద్, అరుణ్‌కుమార్, రవికుమార్, మురళీధర్‌రావు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

**నేరేడుచర్ల :** గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11కేవీ పత్తేపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా సోమవారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ పందిరి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

**చిలుకూరు :** మండలంలోని బేతవోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా కొండాపురం ఫీడర్, రామాపురం, మాధవగూడెం ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు ఆదివారం తెలిపారు. అందుకు వినియోగదారులు సహకరించాలన్నారు.

**ఆలయానికి వరిగడ్డి అందజేత**

**కోదాడరూరల్ :** పట్టణంలోని తమ్మర గ్రామానికి చెందిన రైతు సామినేని వెంకటేశ్వర్లు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి ట్రాక్టర్ వరిగడ్డిని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా రైతును దేవస్థానం డిప్యూటీ కమిషనర్, ఈఓ కిషోర్‌కుమార్, చైర్మన్ జంగాల శ్రీనివాస్ అభినందించి తీర్థప్రసాదాలు అందజేశారు.

**వాలీబాల్ సమ్మర్ శిక్షణ ప్రారంభం**

**నడిగూడెం :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దివంగత యెలుగూరి వెంకన్న జ్ఞాపకార్థగా నిర్వహించనున్న సమ్మర్ వాలీబాల్ శిక్షణను నిర్వాహకులు యెలుగూరి సతీష్, పల్లపు నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కిరణ్, గుండు శ్రీధర్, మేరాజుద్దీన్, ఇంతియాజ్, నాగరాజు, శ్రీకాంత్, గోపాల్, ఉపేందర్, వీరయ్య ఉన్నారు.

**మధ్య దళారులను నమ్మొద్దు**

**మునగాల :** మండలంలో ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని, ఆధార్‌కార్డులు తీసుకురావాలని చెప్పే మధ్య దళారీల మాటలు నమ్మొద్దని కాంగ్రెస్ మండల నాయకుడు కాసర్ల శ్రీనివాసరావు ఎలియాస్ బోస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పలు పార్టీల నుంచి వచ్చి కాంగ్రెస్‌లో చేరిన ఓ నాయకుడు లబ్ధిదారులను నమ్మిస్తున్నాడని అన్నారు. అమాయక ప్రజలు కొంతమంది నమ్మి సదరు నాయకుడికి ఆధార్‌కార్డులు ఇస్తున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం పారదర్శకంగా అర్హులైన వారికి మాత్రమే మంజూరు చేస్తుందన్నారు.

**కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి**

**గరిడేపల్లి :** కార్మికులు, ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కీతవారిగూడెంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆర్థిక విధానాల మూలాన పోరాటాలు చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు. కార్యక్రమంలో రాయిరాల శ్రీనివాస్, మీసాల మట్టయ్య, భిక్షం, సుధాకర్, కళమ్మ, అర్జున్, యానాల సోమయ్య, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సోమగాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**పీఎఫ్‌పై అవగాహన సదస్సు**

**కోదాడరూరల్ :** కోదాడ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల పీఎఫ్ సభ్యులకు కార్యాలయ ఆవరణలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, జిల్లా నోడల్ అధికారి పెండ్యాల రాంబాబు ఆదివారం తెలిపారు. ఈ సదస్సులో పీఎఫ్ బెనిఫిట్స్, పెన్షన్, బీమాలపై అవగాహన కల్పిస్తారని, సమస్యలుంటే పరిష్కరిస్తారని తెలిపారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో కార్మికులు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

**తైక్వాండో నేర్చుకోవడం ఉపయోగకరం**

**హుజూర్‌నగర్ :** తైక్వాండో నేర్చుకోవడం వల్ల ఎన్నో రకాల ఉపయోగాలు ఉన్నాయని తైక్వాండో ఎగ్జామినర్ అనిల్‌కుమార్, స్థానిక తైక్వాండో కోచ్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ అంబేద్కర్ అన్నారు. ఆదివారం పట్టణంలో తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్టులో ఎల్లో, గ్రీన్, బ్లూ బెల్టులను సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. అనంతరం వారు మాట్లాడారు. తైక్వాండో నేర్చుకోవడంతో చదువులో, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**గడ్డివాము దగ్ధం**

**నేరేడుచర్ల:** ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటన ఆదివారం నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. నేరేడుచర్ల మున్సిపాలిటీకి చెందిన సింగు మోహన్‌రావు స్థానిక ఎస్‌ఆర్ ఫ్రైడ్ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఐదు ఎకరాల గడ్డిని కట్టలు కట్టి గడ్డివాము ఏర్పాటు చేశాడు. ఆదివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు గడ్డివాము నుంచి మంటలు రావడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేసరికి మొత్తం గడ్డి కాలిపోయింది. సుమారు రూ.70వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

**పశువులు రోడ్లపైకి రాకుండా చూడాలి**

**మునగాల :** మండల పరిధిలోని జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల రైతులు తమ పశువులు, గేదెలను రహదారిపైకి రాకుండా చూడాలని ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ ఆదివారం కోరారు. రహదారిపైకి రావడంతో గత మూడు రోజుల నుంచి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు.

**గోవిందు సేవలు మరువలేనివి**

**కోదాడరూరల్ :** ప్రజా సమస్యల పరిష్కారానికై వీసాల గోవిందు చేసిన సేవలు మరువలేనివని అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అన్నారు. ఆదివారం పట్టణంలోని కొమరబండలో నిర్వహించిన గోవిందు వర్ధంతిలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కామల్ల సైదులు, మద్దెల వెంకన్న, ప్రతాప్, జానయ్య, అనంతరామయ్య, భిక్షం ఉన్నారు.